


నేడు ఆటల పోటీలు ప్రారంభం

విచ్చేయనున్న మంత్రి కారుమూరి, జెడ్‌పి ఛైర్మన్ కవురు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఈ నెల 21 నుండి 26వ తేదీ వరకు స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో టిబిఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్, కబడ్డీ, విలువిద్య పోటీలను శనివారం పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మాజీ డిప్యూటీ సిఎం ఆళ్ల కాళీ కృష్ణశ్రీనివాస్ (నాని) ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువత పాల్గొని జయప్రదం చేయాలని టిబిఆర్ యూత్ కోరింది.

మా పేర్లు నమోదు చేయండయ్యా..!

ఇ-క్రాప్ నమోదుపై కౌలురైతుల ఆవేదన

వాస్తవ సాగుదారులు 90 శాతం నమోదుకు దూరం

ఖరీఫ్ ధాన్యం అమ్మకానికి కౌలురైతుల నానావస్థలు

రబీలోనైనా కౌలురైతుల పేర్లు నమోదుకు డిమాండ్

కొల్లేరును ఆనుకుని అనసరి భూముల ఇ-క్రాప్‌పై అధికారుల మౌనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కష్టపడి సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు కావు. ప్రభుత్వం అందించే ఏఒక్క సాయమూ వారికి అందదు. చివరికి తాము పండించిన ధాన్యం సైతం తమ పేరు మీద అమ్ముకోవడానికి లేకుండాపోయింది. ధాన్యం తరలింపునకు అయ్యే రవాణా, జట్టు ఖర్చులు సైతం వారికి అందని దుస్థితి నెలకొంది. ఇ-క్రాప్‌లో కౌలురైతుల పేర్లు నమోదు కాకపోవడమే దీనికి ప్రధాన కారణం. రబీకి సంబంధించి ఇ-క్రాప్ నమోదు జరుగుతుండటంతో ఈసారైనా తమ పేర్లు నమోదు చేయండయ్యా అంటూ కౌలురైతులు మొత్తుకుంటున్న పరిస్థితి రెండు జిల్లాల్లోనూ నెలకొంది.



రెండు జిల్లాల్లోనూ రబీకి సంబంధించి ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ డిసెంబర్ 28వ తేదీ నుంచి సాగుతోంది. ఇ-క్రాప్ నమోదులో కౌలురైతుల పేర్లు ఈసారీ నమోదు చేయకపోవడంపై సాగుదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లు కాకుండా భూయజమానుల పేర్లు నమోదు చేయడం ద్వారా తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల వరకూ వరి సాగవుతోంది. రెండు జిల్లాల్లోనూ 75 శాతం వరిసాగు కౌలురైతులే చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇ-క్రాప్‌లో సాగు చేస్తున్న రైతుల పేర్లు నమోదు చేయాలి. అయితే ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. సిసిఆర్‌సి ఉంటే కౌలురైతుల పేర్లు నమోదు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా ఆ సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉండగా సిసిఆర్‌సి కార్డులు అందుకున్న కౌలురైతులు సగం కూడా లేరు. అదీ పదెకరాలు సాగు చేస్తున్న కౌలురైతుకు రెండెకరాలకు మాత్రమే సిసిఆర్‌సి కార్డు ఇచ్చిన పరిస్థితి ఉంది. సాగు చేయని భూయజమానుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదవుతున్నాయి. దీంతో ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బతిన్న పరిహారం సైతం భూయజమానికి వెళ్లిపోతుంది. బీమా, బ్యాంకులిచ్చే పంట రుణం సహా అన్ని భూయజమాని జేబుల్లోకి చేరుతున్నాయి. దీనిపై ఎప్పటి నుంచో కౌలురైతులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు అన్యాయం చేస్తూ భూయజమానులకు కొమ్ముకాస్తున్న పరిస్థితి ఉంది.

పండించిన ధాన్యం సైతం అమ్ముకోలేని దుస్థితి

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం సైతం కౌలురైతులు తమ పేరు మీద అమ్ముకోలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ధాన్యం కొనుగోలు అంతా ఇ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం సాగిస్తోంది. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లు నమోదవ్వడంతో పండిన పంటసైతం వారి పేరు మీదే అమ్మాల్సి వస్తోంది. దీంతో ధాన్యం సొమ్ము భూయజమాని ఖాతాల్లోనే జమవుతోంది. గతంలో కౌలురైతులు పంట విక్రయించి కౌలు సొమ్ము భూయజమానికి ఇచ్చేవారు. దిగుబడి తక్కువగా వస్తే ఎంతోకొంత తగ్గించి భూయజమానికి ఇచ్చి బతిమలాడుకునేవారు. ఇప్పుడు అందుకు పూర్తి విరుద్ధంగా సాగుతోంది. భూయజమాని ఖాతాలో సొమ్ము జమ కావడంతో పంట పండినా.. పండకపోయినా పూర్తి కౌలుసొమ్ము తీసుకుని మిగిలిన సొమ్ము కౌలురైతులకు ఇస్తున్నారు. ధాన్యం సొమ్ము జమయ్యే వరకూ పెట్టిన పెట్టుబడికి సైతం వడ్డీ కడుతున్నారు. గడిచిన ఖరీఫ్‌లో ప్రభుత్వం నూతన ధాన్యం కొనుగోలు విధానం తెచ్చింది. దీంతో జట్టు, రవాణా ఛార్జీలు వంటివి సైతం రైతులు పెట్టుకుని ధాన్యం తరలించిన పరిస్థితి నెలకొంది. జట్టు, రవాణా ఛార్జీలు సైతం భూయజమాని ఖాతాల్లోకి చేరుతున్నాయి. ఈ సొమ్ము నిబంధనల ప్రకారం కౌలురైతులకు ఇవ్వాల్సి ఉన్న భూయజమానులు ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే పొలం కౌలుకు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో కౌలురైతుల పరిస్థితి అత్యంతదారుణంగా తయారైంది. ఇ-క్రాప్ నమోదులో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారం కారణంగానే కౌలురైతులకు ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనసరి భూములను ఇ-క్రాప్ చేయరూ..!

ఇ-క్రాప్ నమోదైతేనే ఆ భూమికి సంబంధించి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కొల్లేరును ఆనుకుని పట్టాల్లేని అనసరి భూములు ఏలూరు, పశ్చిమగోదారి జిల్లాల్లో వేలాది ఎకరాలు ఉన్నాయి. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఆకివీడు వంటి మండలాల్లో ఉన్న అనసరి భూముల్లో పెద్దఎత్తున రబీసాగు సాగుతోంది. ఈ భూములకు సంబంధించి ఇ-క్రాప్ నమోదుపై ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఎటువంటి ఆదేశాలూ ఇవ్వకుండా మౌనం వహిస్తున్నారు. దీంతో దిగువస్థాయి అధికారులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొల్లేరును ఆనుకుని ఉన్న అనసరి భూముల ఇ-క్రాప్‌పై వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే రబీ ధాన్యం అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి రానుందని ఆందోళన చెందుతున్నారు.

పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత అందరిది

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

తల్లిదండ్రుల ప్రేమ, కుటుంబ వాతావరణంలో ఉంటేనే పిల్లలు చక్కని బాధ్యత గల పౌరులుగా తయారవుతారని, దీనికోసం అనాథ పిల్లల దత్తతను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ, అడాప్షన్ రెగ్యులేషన్-2022 ప్రకారం ఏలూరు శిశుగృహలో ఆశ్రయం పొందిన చిన్నారి బేబీ స్నేహితను చిత్తూరు జిల్లాకు చెందిన దత్తత అర్జీదారులు పి.అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా దత్తత అధికారి వారి ద్వారా దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పిల్లలు లేని తల్లిదండ్రులు చట్టప్రకారం కారా నియమ నిబంధనలు పాటించి దత్తత పొందా లన్నారు. పిల్లల భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దే బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందన్నారు. దత్తత పొందాలనే తల్లిదండ్రులు జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమాధికారి కె.పద్మావతి, డిసిపిఓ సిహెచ్.సూర్యచక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్, సోషల్ వర్కర్ సుజనమ్మ పాల్గొన్నారు.



చిన్నారిని దత్తత ఇస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఇతర అధికారులు

26న రైతు ర్యాలీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు

ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై నిరసనలో భాగంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 26న ఏలూరులో ఎఎస్‌ఆర్ స్టేడియం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు ట్రాక్టర్లు, ఎడ్లబళ్ల ర్యాలీని జయప్రదం చేయాలని రైతుసంఘాల సమన్వయ కమిటీ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం స్థానిక అమర్‌భవన్‌లో రైతుసంఘాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు రుణాలు మాఫీ చేస్తున్న మోడీ ప్రభుత్వం రైతుల పంట రుణాలను మాఫీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐకెఎం రాష్ట్ర కార్యదర్శి డి.హరినాథ్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా యాభై శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరలు రైతులకు అందేలా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలన్నారు. ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ మిర్చి పంటలో తామర పురుగు వల్ల నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్ కాంగ్రెస్ నాయకులు బిడి.రవికుమార్ మాట్లాడుతూ సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ర్యాలీ పోస్టర్లను సమన్వయ కమిటీ ఆవిష్కరించింది. సమావేశంలో కొమ్మన్న నాగేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు, గంటా పాపారావు, లక్ష్మణరావు, మడుపల్లి వెంకట నాగేంద్రరావు జోషి, పుల్లారావు పాల్గొన్నారు.

చింతలపూడి: స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 26న ఏలూరులో నిర్వహించనున్న ర్యాలీలను జయప్రదం చేయాలని ఎఐకెఎస్ జిల్లా నాయకులు డి.రంగనాథ్, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి దొంత కృష్ణ అన్నారు. రైతు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ట్రాక్టర్ల ర్యాలీ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం స్థానికంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎం.వసంతరావు, సురేష్, కంచర్ల గురవయ్య, చీకటి బాబూరావు, ఆర్‌విఎస్.సత్యనారాయణ, టి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.


విధుల్లో చేరిన గంటకే బదిలీ

ఐటిడిఎ పిఒగా రజినీకుమారి బాధ్యతల స్వీకరణ

ఆపై గంటలోనే ఎన్‌టిఆర్ జిల్లా హౌసింగ్ పీడీగా బదిలీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కెఆర్ పురం ఐటిడిఎ పిఒగా బాధ్యతలు స్వీకరించిన గంటకే వేరే ప్రాంతంలోని పోస్టుకు బదిలీ అయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఏలూరులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఎం.రజినీకుమారి కెఆర్‌పురం ఐటిడిఎ పిఒగా బదిలీ అయ్యారు. దీంతో ఆమె శుక్రవారం ఉదయం 11 గంటలకు కెఆర్‌పురం ఐటిడిఎ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఐటిడిఎ అధికారులను పరిచయం చేసుకునే ప్రక్రియ సాగుతుండగానే గంట వ్యవధిలోనే ఆమెను ఎన్‌టిఆర్ జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అటు ఉద్యోగులు, ఇటు గిరిజనులు అవాక్కయ్యారు. ఎందుకంటే కొంతకాలంగా ఐటిడిఎ పిఒ నియామకంలో సందిగ్ధత నెలకొంది. పిఒగా ఎవరోకరిని నియమించడం, వారు చేరకపోవడం, లేక చేరిన కొద్దిరోజులకే బదిలీ కావడం సర్వసాధారణమైంది. గత అక్టోబర్‌లో ఇక్కడ పిఒగా పని చేస్తున్న శ్రీనుకుమార్‌ను చింతూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. చింతూరు ఐటిడిఎ పిఒను రామశేషును ఇక్కడ నియమించారు. అయితే ఆయన విధులు చేపట్టకపోవడంతో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఇన్‌ఛార్జి పిఒగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఐటిడిఎ పిఒగా రజినీకుమారి గురువారం నియమితులు కావడం, శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించడం, ఆపై గంటలోనే బదిలీ కావడం జరిగింది. ఈ ప్రభుత్వానికి, అధికారులకు కెఆర్‌పురం ఐటిడిఎ అంటే చిన్న చూపా.. లేక గిరిజనుల పట్ల నిర్లక్ష్యమో తెలియని పరిస్థితి ఏర్పడిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా కెఆర్‌పురం ఐటిడిఎకు పూర్తిస్థాయి పిఒను నియమించాలని గిరిజనులు కోరుతున్నారు.



ఐటిడిఎ పిఒగా విధుల్లో చేరిన రజినీకుమారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది



బెంగుళూరులో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభకు ప్రతినిధులుగా హాజరైన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నేతలు

గృహ నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దు

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

జగనన్న కాలనీల్లో డ్రెయిన్లు సహా మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఉగాది నాటికి జిల్లాలో 26 వేల ఇళ్లు పూర్తయ్యేలా కేంద్రీకరణ

గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీషా

ప్రజాశక్తి - ఏలూరు, పెదవేగి

రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే గట్టి సంకల్పంతో ఉందని, దీనిలో భాగంగా ఏలూరు జిల్లాలో 26 వేల ఇళ్లు పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉందని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీషా చెప్పారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతి తీరును పరిశీలించేందుకు శుక్రవారం జిల్లాకు విచ్చేసిన గృహనిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీషా, డైరెక్టర్ గంటా సంధ్య ఏలూరు, పెదవేగి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎమ్‌డి లక్ష్మీషా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గృహ నిర్మాణాలకు వనరుల విషయంలో దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఉగాది నాటికి జిల్లాలో నిర్ధేశించిన 26 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉగాది నాటికి 26 వేల ఇళ్లు పూర్తి చేయాలనే లక్ష్యానికి ఇంతవరకు 14 వేల ఇళ్లు పూర్తి చేశారని, మిగిలిన 12 వేల ఇళ్లు మార్చి 20వ తేదీలోపు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రోజువారీ సమీక్షలతో నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆప్షన్-3 కింద కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ విషయంలో నాణ్యతలో రాజీ పడొద్దని ఇదే సమయంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయడంపై దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నిర్మాణ సామగ్రి అందివ్వడంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్‌ను హౌసింగ్ ఎమ్‌డి లక్ష్మీషా ఆదేశించారు. జగనన్న కాలనీల్లో అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, రుణ సదుపాయం వంటి అంశాల్లో ఎక్కడా సమన్వయ లోపం లేకుండా సంబంధిత సమన్వయ శాఖలైన ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, డిఆర్‌డిఎ, విద్యుత్ తదితర శాఖలు సమిష్టిగా ముందుకెళ్లాలన్నారు. తొలుత ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి పాత లేఅవుట్‌లో 650 ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. పోణంగిలో ఆప్షన్-3లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణంలో నాణ్యతతోపాటు పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సొమ్ము చెల్లింపు జరిగిందీ.. లేనిదీ వారు పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వద్ద ప్రతి ఇంటి లబ్ధిదారుల పూర్తి సమాచారం ఉండాలన్నారు. అనంతరం పెదవేగి మండలం విజయరాయి, నడింపల్లి ఇళ్ల లేఅవుట్‌లను వారు పరిశీలించారు. వీరి వెంట హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్, గృహనిర్మాణ సంస్థ ఇంజినీర్లు, సిబ్బంది ఉన్నారు.



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న లక్ష్మీషా, అధికారులు

మిర్చి రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నల్ల తామర పురుగు, తెగుళ్లతో నష్టపోయిన మిర్చి రైతులకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పట్టెన్నపాలెంలో నల్ల తామర పురుగు, తెగుళ్లతో మిర్చి పంటకు వాటిల్లిన నష్టాన్ని ఆ సంఘం నాయకులు శుక్రవారం పరిశీలించారు. నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం, ముసునూరు, ఆగిరిపల్లి, లింగపాలెం, కుక్కునూరు, వేలేరుపాడు తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. నల్ల తామర పురుగు, వైరస్ తెగుళ్లతో మిర్చి పంటకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఎకరాకు రూ.లక్ష 50 వేలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టారని తెలిపారు. 25 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చే మిర్చి దిగుబడి 3, 4 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. తెగుళ్లను రాష్ట్ర విపత్తుగా ప్రకటించి, పంట నష్టాలను నమోదు చేసి పరిహారం ఇవ్వాలని కోరారు. తెగుళ్ల నివారణకు ఉద్యాన శాఖ ద్వారా తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల అధ్యక్షులు బోడిక రామచంద్రరావు, రైతు నాయకులు దాసరి మధు, పట్టెన్నపాలెం మాజీ సర్పంచి ఆకుల చల్లారావు, మిర్చి రైతులు గూడుపు శ్రీనివాసరావు, పసుపులేటి లక్ష్మీనారాయణ, సింగులూరి రాంబాబు పాల్గొన్నారు.



తెగుళ్లు సోకిన మిర్చి పంటను పరిశీలిస్తున్న రైతు నేతలు

మరో విడత గ్రామ సభలు : జెసి

ఆక్వా, నాన్ ఆక్వా జోన్ నిర్ధారణపై

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నిర్దేశించిన లక్ష్యానికి అదనంగా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే ఈ విషయాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గౌతమి సమావేశపు మందిరంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఆ మండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు, కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్దేశించిన లక్ష్యానికి అదనంగా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జాయింట్ కలెక్టర్ అరుణ్ బాబు స్పందిస్తూ ధాన్యం సేకరణకు నిర్దేశించిన లక్ష్యానికి మించి అదనంగా ధాన్యం కొనుగోలు విషయంలో ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లాలో ఆక్వా, నాన్ ఆక్వా జోన్ నిర్ధారణ విషయంలో సంబంధిత శాఖాధికారులు సరైన సమాచారంతో ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు జెసి దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత స్థానిక ప్రజాప్రతినిధులకు గ్రామసభ నిర్వహణ వివరాలను తెలియజేయాలని కోరారు. దీనిపై జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు స్పందిస్తూ ఆక్వా, నాన్ ఆక్వా జోన్ నిర్ధారణపై ఆయా గ్రామాల్లో తిరిగి గ్రామసభలు నిర్వహించడంతోపాటు తప్పనిసరిగా మత్స్యశాఖ ఎఫ్‌డిఒ, ఇతర అధికారులు హాజరవ్వాలన్నారు. సంబంధిత సమాచారాన్ని ముందస్తుగా స్థానిక ఎంఎల్‌ఎలకు, ఇతర ప్రజాప్రతినిధులకు తెలియజేసి గ్రామసభ పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తమ ప్రాంతంలో పామాయిల్ సాగుకు మొక్కల డిమాండ్ ఎక్కువగా ఉందని, ఆ దిశగా పెద్దఎత్తున మొక్కలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. ఇప్పటికే ఈ విషయంపై పలుసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ సాగులో డ్రోన్ల వినియోగంలో భాగంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లకు సబ్సిడీపై అందిస్తున్నారని, అదే విధంగా వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు కూడా అందిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ రబీకి సంబంధించి ఇ-క్రాప్ నమోదు ప్రారంభమైనందున ఈ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో పలు మండలాల్లో టార్పాలిన్లు, స్ప్రేయర్లు సబ్సిడీపై రైతులకు అందించాలని కోరామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తొమ్మిది మండలాల నుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై మైక్రో న్యూట్రియన్స్ అందించాలని కోరడం జరిగిందన్నారు. సమావేశంలో మండలి సభ్యులు వైఆర్‌కెపిఆర్.బాబ్జి, పి.రవీంద్రరెడ్డి, చిట్టూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల జాయింట్ డైరెక్టర్లు వై.రామకృష్ణ, జి.నెహ్రూబాబు, ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాండురంగారావు, ఎల్‌డిఎం ఎస్.వెంకటేశ్వరరావు, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్, విద్యుత్, మత్స్యశాఖ, సెరీకల్చర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతితక్కువ వడ్డీకి ఆక్వా రైతులకు రుణాలు

ఇండియన్ బ్యాంక్ జోనల్ చీఫ్ మేనేజర్ కెవిఎం.మూర్తి

ప్రజాశక్తి - మండవల్లి

ఆక్వా రైతులకు అతి తక్కువ వడ్డీ రేట్లతో ఇండియన్ బ్యాంక్ ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నామని ఇండియన్ బ్యాంక్ జోనల్ చీఫ్ మేనేజర్ కెవిఎం.మూర్తి తెలిపారు. స్థానిక ఇండియన్ బ్యాంక్ మండవల్లి బ్రాంచిని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం బ్యాంకు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ జోనల్ పరిధిలో ఎంఎస్‌ఎంఇ స్కీమ్ ద్వారా ఆక్వా రైతులకు రూ.20 నుండి రూ.40 కోట్లు మేర రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు.

ఆక్వాకు సంబంధించిన పెద్ద రైతులు చేపలు, రొయ్యలు పెంపకానికి కావాల్సిన ల్యాండ్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, ఫ్యాక్టరీ ఏర్పాటు, వాహనాల కొనుగోలు వంటి వాటికి ఇండియన్ బ్యాంకు ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్‌ఎంఇ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ఖాతాదారులను గుర్తించి, వారి వద్దకు వెళ్లి రుణాలు మంజూరు చేసేలా ప్రయత్నించాలని మేనేజర్‌కు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎబిఎం బి.పద్మకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ పి.రాజేష్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెదపాడు

పోక్సో చట్టాలు, జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. మండలంలోని వసంతవాడ గ్రామంలో పోక్సో చట్టాలు, జాతీయ లోక్ అదాలత్ అంశంపై ప్రజలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటికి పోక్సో చట్టం అమల్లోకి వచ్చి పది సంవత్సరాలైందని, అయినప్పటికీ ప్రజల్లో ఈ చట్టంపై అవగాహన చాలా తక్కువ ఉందని చెప్పారు. ప్రజలు ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి బాల బాలికలకు రక్షణ కల్పించుకోవాలన్నారు. బాధితులు ఈ చట్టం ద్వారా నష్టపరిహారాన్ని పొందవచ్చన్నారు. 2023, ఫిబ్రవరి 11వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయలోక్ నిర్వహిస్తున్నారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయరాజ్‌కుమార్, పెదపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.నాగబాబు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒ ఝాన్సీరాణి ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను మండలం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం దేవర రాజకుమార్ అనే వ్యక్తి తన భూమి వివాదంలో ఉందని స్పందనలో ఫిర్యాదు చేయగా దానికి సంబంధించి భూ రికార్డులను పరిశీలించారు. రికార్డ్ వెరిఫికేషన్ అనంతరం తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో జరుగుతున్న రీ సర్వేపై తహశీల్దార్ జి.ఎలీషాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సందీప్, విఆర్ఒలు మాధురి, తులసి, రాజు, షరీఫ్ రవితేజ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో చీడపీడల నివారణ

ప్రజాశక్తి - భీమడోలు

వరి పైరుపై ఆశించే చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు అమలు చేయాలని ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన సెంచురియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విద్యార్థులు యల్లాప్రగడ శేఖర్, కొండిరెడ్డి లోకేష్ తెలిపారు. సదరు విశ్వవిద్యాలయంలో బిఎస్‌సి అగ్రికల్చర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఇద్దరు క్షేత్రస్థాయి అనుభవం కోసం మండలంలోని సూరప్పగూడెం గ్రామానికి వచ్చి రైతులను కలిశారు. క్షేత్రస్థాయిలో డెమో ప్రదర్శన చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన రైతులకు చేతి గ్లౌజులు, మాస్కులు పంపిణీ చేశారు.

ఆయుష్మాన్ ఆరోగ్య బీమా సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా సేవలను అర్హులందరూ వినియోగించుకోవాలని ఎంపిడిఒ రాఘవన్ కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పథకం కింద నమోదైన మూడు వేల మందికి వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతులు త్వరలో రానున్నాయని తెలిపారు. ఆ తరువాత నుంచి బీమా సదుపాయాలు వారికి అందుబాటులో వస్తాయన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : టిడిపి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ విమర్శించారు. మండలంలోని బండివారిగూడెంలో ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, మక్కినవారిగూడెం సొసైటీ మాజీ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ, బిసి సెల్ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని వణుదుర్రులో శుక్రవారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, పార్టీ నాయకులు దావు నాగరాజు, శ్రీహరిపురం సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, రెడ్డినాగరాజు, పోసిన పాండురంగారావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని నరసింహారావుపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ పి.అమర్ సూచించారు. స్థానిక పిరంగుల దిబ్బ 23వ డివిజన్‌లో శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెంగీ కారక దోమలు ఎక్కువగా మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. ప్రజలు పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్, శ్రీనివాస్, ఎఎన్ఎంలు శాంతిప్రియ, శివ నాగజ్యోతి, అప్పలనర్సమ్మ ఝాన్సీ మంజు, ఆశాలు మరియమ్మ, కోటేశ్వరమ్మ, కుమారి, రమాదేవి, శ్యామల, నాగమణి శివశంకరి పాల్గొన్నారు.

గణపవరం : శుక్రవారం డ్రైడే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రధానమంత్రి జన ఆరోగ్య యువజన కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్ నాయుడు తెలిపారు. సచివాలయాల వద్ద ఏర్పాటుచేసిన హెల్త్ సెంటర్‌లో ప్రతిఒక్కరూ వైద్య పరీక్షలు నిర్వహించుకుని మందులు తీసుకోవాలన్నారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం
మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. మరో ముగ్గురు రైతులు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని నిమ్మలగూడెం పంచాయతీ రామన్నగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన నిమ్ము శేషగిరిరావు (45) తన వ్యవసాయ బోరు పాడైపోవడంతో మరమ్మతుల నిమిత్తం ఆ బోరు ఇనుపపైపులు పైకి లాగుతున్నాడు. తనతో పాటు మరో ముగ్గురు రైతులు బడే సురేష్, నక్కపోయిన మంగరాజు, గుర్రముచ్చు సాంబశివ ఇనుప పైపులను లాగుతున్నారు. ఈ క్రమంలో ఆ ఇనుప పైపు సమీపంలో ఉన్న 11 కెవి విద్యుత్ తీగలకు తగలడంతో ఆ పైపును పట్టుకున్న శేషగిరిరావుతో మరో ముగ్గురు రైతులు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఇది గమనించిన చుట్టుపక్కల రైతులు క్షతగాత్రులను హుటాహుటిన స్థానిక నందాపురం పిహెచ్‌సికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శేషగిరిరావు మృతి చెందినట్లు నిర్ధారించారు. చనిపోయిన శేషగిరిరావుకు భార్య దుర్గ, వృద్ధాప్యంలో ఉన్న తండ్రి, ఆరో తరగతి చదువుతున్న కుమార్తె తేజస్విని, యుకేజి చదువుతున్న కుమారుడు సాదిక్ డానియల్ ఉన్నారు. ముగ్గురు రైతులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ముసునూరులో...

ముసునూరు :విద్యుదాఘాతంతో వ్యక్తి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చెక్కపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చెక్కపల్లికి చెందిన గండికోట వెంకటచిన్నయ్య (29) నిర్మాణ దశలో ఉన్న తన రేకుల షెడ్డుకు విద్యుత్ యంత్రం సాయంతో మేకులు బిగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ యంత్రానికి ఉన్న వైరు నుంచి వచ్చిన విద్యుదాఘాతానికి గురైన వెంకటచిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటచిన్నయ్య మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యాన్ ఢీకొని ఏడు గొర్రెలు మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

మినీవ్యాన్ ఢీ కొని ఏడు గొర్రెలు మృతి చెందగా, 18 గొర్రెలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కామవరపుకోట నుంచి తెలంగాణ వెళ్తున్న మినీవ్యాన్ మండలంలోని ప్రగడవరంలో జి.లక్ష్మికి చెందిన గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు మృతి చెందాయి. 18 గొర్రెలకు గాయాలయ్యాయి. విలువైన గొర్రెలు మృతి చెందడంతో లక్ష్మి వాపోతుంది.

ముసునూరులో ఇన్‌ఛార్జి పాలనే దిక్కు

పూర్తిస్థాయిలో సేవలందడం లేదని డ్వాక్రా మహిళల గగ్గోలు
సీసీలు పట్టించుకోవడం లేదని ఆవేదన
అధికారులు స్పందించాలని వేడుకోలు



పేరు బోర్డు లేని వెలుగు కార్యాలయం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులో ఇన్‌ఛార్జి పాలనతో తమకు పూర్తిస్థాయిలో సేవలు అందడంలేదని ప్రజలు వాపోతున్నారు. కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలుగు కార్యాలయానికి కనీసం పేరు బోర్డు లేదని పలు విమర్శలు చేస్తున్నారు. నూజివీడు మండలం ఎపిఎం ముసునూరు మండల ఇన్‌ఛార్జి ఎపిఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆ ఉద్యోగి ఎక్కడ ఉంటాడో తెలియని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా సదరు వ్యక్తి ఈ రెండు ఉద్యోగ బాధ్యతలే కాకుండా నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఏరియా కో-ఆర్డినేటర్‌గా అదనపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఏ ఉద్యోగానికి పూర్తిస్థాయిలో బాధ్యతగా పనిచేయలేని పరిస్థితి నెలకొందని, దీంతో తాము పలు ఇబ్బందులకు గురవుతున్నామని మండల వాసులు వాపోతున్నారు. ఇక ముసునూరు మండల వెలుగు క్రాంతి పథం కార్యాలయంలో నలుగురు సీసీలు ఉన్నారు. వీరి కింద మండలంలోని 16 రెవెన్యూ గ్రామాలు, నాలుగు శివారు గ్రామాలు కలిపి మొత్తం 20 గ్రామాలకు 47 మంది బుక్ కీపర్లు, మొత్తం 1487 సంఘాలు వీరి ఆధీనంలో ఉంటాయి. ఒక్కో బుక్ కీపర్‌కు పది నుంచి 15 సంఘాలు ఉంటాయి. మండల స్థాయి అధికారి ఇన్‌ఛార్జి కావడంతో పర్యవేక్షణ లోపంతో సీసీలు బుక్ కీపర్‌కు సలహాలు, సూచనలు పూర్తి స్థాయిలో ఇవ్వడంలేదు. డ్వాక్రా రుణాలు, సిఎఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజి రుణాలు ఆయా గ్రూపులను బట్టి రూ.50 వేల నుంచి రూ.4.50 లక్షల వరకు రుణాలు అందించి నెలనెలా డ్వాక్రా సంఘం సభ్యులే నెలకొకరు చొప్పున కట్టాలి. ఆ రుణం తీరిన వెంటనే మళ్లీ రుణం తీసుకోవడం పరిపాటి. ఇలాంటి సమయంలో సీసీలు పర్యవేక్షణతో పాటు ఎపిఎం అందుబాటులో ఉండి సంతకాలతో పాటు బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలి. బుక్‌కీపర్, సీసీ, ఎపిఎం సమన్వయంతో ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తే డ్వాక్రా మహిళలకు రుణాలు త్వరగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వస్తాయి. కాని ఇన్‌ఛార్జి ఎపిఎం కావడంతో ఆయన ఏ ఉద్యోగంలో ఎక్కడ ఉన్నారో.. లేదా ఈ మూడు ఉద్యోగాల పేరట వేరే పనిలో ఉన్నారోనని కనిపెట్టలేని పరిస్థితి అని మండల వాసులు వాపోతున్నారు. అంతేకాకుండా బుక్ కీపర్లు తమ జీతం కాకుండా డ్వాక్రా మహిళల వద్ద నుంచి నగదు వసూలు చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రుణం కావాలంటే తాము సంతకం పెట్టాలని, ఈ మేరకు తమకు కొంత డబ్బు ఇవ్వాలని ఒక్కో గ్రూపు నుంచి వసూలు చేస్తున్నట్లు మండల వాసులు చెబుతున్నారు. ఈ క్రమంలో నగదు వినియోగించుకున్న బుక్‌కీపర్లు సస్పెండ్ అయిన దాఖలాలు ముసునూరు మండలంలో ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తమకు సక్రమంగా పూర్తిస్థాయిలో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు, మండల ప్రజలు కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం : ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి - ఏలూరు

అన్ని దానాల్లో రక్తదానం ఉత్తమమైందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. రక్తం అవసరమైన వ్యక్తికి సరైన సమయంలో అందకపోవడం వల్ల ఎంతోమంది చనిపోతున్నారని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని ఆయన సూచించారు. 34వ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక అమీనాపేటలో ఉన్న సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద ఉన్న కళ్యాణ మండపంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఏ విధమైన అనారోగ్య సమస్యలు ఉండవని చెప్పారు. ఈ రక్తదాన శిబిరంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న ఆటో డ్రైవర్లను, ప్రజలను అభినందించారు. ఆర్‌డిఒ కె.శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో 34వ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో రక్తదాన శిబిరం, కంటి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జయరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రతి సంవత్సరం 80 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యుఎన్ఐ నివారణ నివేదిక ప్రకారం రోడ్డు ప్రమాదాలను 50 శాతం వరకు తగ్గించాలని ముఖ్య ఉద్దేశంతో ఈ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి పైడేశ్వరరావు, కె.విజయరాజు, ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి, జి.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వైఎస్‌వి.కల్యాణి, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఆర్ఐలు కృష్ణంరాజు, ఎం.రాజు, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్, ఆర్‌డిఒ కార్యాలయం ఎఒ ధనలక్ష్మి, ఎం.రాము పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డిఎస్‌పి కెవి సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యా వికాస్ విద్యా సంస్థల ప్రాంగణంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి ఎండి.మదని, ఎంవిఐ ప్రసాద్, ప్రవీణ, సిఐ బాల సురేష్ బాబు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, విద్యా వికాస్ విద్యాసంస్థల యాజమాన్యం పి.సతీష్ చంద్, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడు : రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా శుక్రవారం నూజివీడు పట్టణ పరిధిలోని కుమార్ సిబిఎస్ఇ విద్యాసంస్థ ఆవరణలో విద్యార్థులకు వాహనచోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు సిఐ ఎంవివిఎస్ఎన్.మూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారులు మురళి, ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ పివి.కుమార్, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులతో నాణ్యమైన దిగుబడి



భీమడోలులో...

ప్రజాశక్తి - భీమడోలు

వరిలో మేలైన వ్యవసాయ పద్ధతులు అమలు చేయడం ద్వారా అధిక మొత్తంలో నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉషారాజకుమారి తెలిపారు. జిల్లాస్థాయిలో 250 ఎకరాల విస్తీర్ణంలో పొలంబడి(క్లస్టర్) కార్యక్రమం 14 వారాల పాటు కొనసాగించేందుకు భీమడోలు గ్రామాన్ని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వై.రామకృష్ణ ఎంపిక చేశారు. ఇక్కడ కార్యక్రమాలను వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకుల పర్యవేక్షణలో భీమడోలు వ్యవసాయ అధికారి ఎస్‌పివి.ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రతి 25 ఎకరాల పర్యవేక్షణకు రైతులకు సహకరించేందుకు ఒక్కొక్క గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకుల వంతున పది మంది సిబ్బందిని వారు నియమించారు. ప్రతి శుక్రవారం వారిరువురు ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపిక చేసిన పొలంబడి వ్యవసాయ క్షేత్రంలో నాలుగో వారపు కార్యక్రమాలను నిర్వహించారు. సదరు పొలంబడి క్షేత్రంలో వరి పైరు పిలక దశలో ఉంది. ఈ నేపథ్యంలో పైరుకు ఆకుముడత, కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశాలు ఉన్నాయి. దీని నివారణ కోసం ముందస్తు చర్యగా వ్యవసాయ అధికారులు వరిలో సహజంగా ఉండే పునరుత్పత్తి లక్షణాన్ని వినియోగించుకునే తీరును రైతులకు వివరించారు. వరికి గల సహజ లక్షణ మైన పునరుత్పత్తి కారణంగా ఆకులు కత్తిరించిన, పిలకలు తొలగించిన ప్రాంతాల్లో నూతనంగా పైరు ఎదిగి పంటకు నష్టం లేనివిధంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పొలంబడి కార్యక్రమం అమలు చేస్తున్న ప్రాంతానికి చెందిన 75 మంది రైతులు హాజరయ్యారు. వారు అడిగిన ప్రశ్నలకు వ్యవసాయ అధికారులు సమాధానం ఇచ్చారు. మెరుగైన సాగు కోసం తమ సూచనలు చేశారు.

ముదినేపల్లి : రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వెంకట మణి అన్నారు. మండలంలోని గురజలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు మండల వ్యవసాయశాఖ అధికారి వేణుమాధవ్ రైతులక పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలో పిఎంజెఎవై ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టాలని ఎంపిడిఒ జి.రాణి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో పిఎంజెఎవై ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఇ జి.రాధాకృష్ణ తెలిపారు. బండివారిగూడెం గ్రామంలో గహ నిర్మాణంపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్లాబ్ నిర్మాణంలో ఉన్న గృహాలకు, ప్లాస్టరింగ్ త్వరగా చేయించాలని, ఫైల్ కాంక్రీట్ వేసిన గృహాలకు పునాదుల నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. జగనన్న కాలనీల వద్ద పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.నాగలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నెరుసు వెంకటేష్, సహాయక ఇంజినీర్ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి వైష్ణవి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇంటిగోడ కూలి మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని, అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. గుడివాడ రూరల్ మండలం శేరిదింటకుర్రుకు చెందిన బాపట్ల కృష్ణప్రసాద్ కుమార్తె బాపట్ల మధులత (6) స్కూల్ నుంచి వచ్చి ఇంటి ప్రాంగణంలో తన సోదరితో కలిసి ఆడుకుంటుండగా ఇంటి గోడ కూలి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా తక్షణ సాయంగా రూ.ఐదువేల నగదు బాధిత కుటుంబానికి అందించింది. కృష్ణా జిల్లా మాజీ కలెక్టర్ లక్ష్మీకాంతం రూ.ఐదు వేలు అందించారు.


సత్యనారాయణబాబు మృతి తీరని లోటు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సూరానేని పెద్ద సత్యనారాయణబాబు మృతి వైసిపికి తీరని లోటని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని నరసింగపాలెం గ్రామానికి చెందిన వైసిపి గ్రామ అధ్యక్షులు, సీనియర్ నాయకులు సూరానేని పెద్ద సత్యనారయణబాబు శుక్రవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. పెద్దసత్యనారాయణబాబు మృతదేహాన్ని ఎంఎల్ఎ ప్రతాప్ సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు గ్రామ సర్పంచి ఎం.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, వైసిపి నాయకులు పి.రామచంద్రరావు(ఎర్రబాబు), పి.నరసింహారావు, ఎం.పురుషోత్తం, మనోహర్ పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను కోరిన ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి



కలెక్టర్ వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కోరారు. జిల్లా కేంద్రం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఆమె శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి జంగారెడ్డిగూడెంపై ప్రత్యేకమైన ఆదరణ చూపాలని కోరామని తెలిపారు. పట్టణంలో తాగునీటి సమస్యపై, పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న వ్యర్థాలు అరికట్టడంపై ఇచ్చిన వినతులను మరో సారి గుర్తు చేశామని తెలిపారు. ఫ్యాక్టరీ వ్యర్థాల వల్ల దుర్వాసన వచ్చి తాగునీరు కాలుష్యం అవుతుందని తెలిపారు. ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కోరినట్లు ఆమె తెలిపారు. ఆమెతో పాటు కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, బత్తిన చిన్నా ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



ఆగిరిపల్లిలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టాలని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి లింగవరపు రమేష్, ఎంపిటిసి సభ్యులు గుర్రం శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, ఎంపిపి గోళ్ల అనూష, వైసిపి నాయకులు ఎం.హరిబాబు, జి.హనుమంతరావు, ఎ.మురళి, వి.రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ముదినేపల్లిలో....

ముదినేపల్లి :మండలకేంద్రమైన ముదినేపల్లిలో ఈ నెల 21వ తేదీ శనివారం నుంచి నాలుగు రోజుల పాటు గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆగిరిపల్లి గ్రామ సర్పంచి చౌటపల్లి లక్ష్మీవిక్టర్‌బాబు అన్నారు. ఆగిరిపల్లి పెద్దకొఠాయి సెంటర్ వద్ద, బొద్దనపల్లిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, జగనన్న స్వచ్ఛ సంకల్పంపై జానపద కళాకారులు కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి పంచాయతీ కార్యనిర్వాహక కార్యదర్శి బి.ప్రసాద్, సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, బొద్దనపల్లి గ్రామ సర్పంచి నక్కనబోయిన విజయలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో జగనన్న ఇళ్లు త్వరగా నిర్మించాలని సిపిఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ముసునూరు, గుళ్లపూడి, యల్లాపురంలో గ్రామాల్లో జగనన్న ఇళ్ల స్థలాలను పార్టీ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, రాయ్యంకుల లక్ష్మణరావు, చాట్ల పుల్లారావుతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



అక్రమ నిర్మాణాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సారథి

అక్రమ నిర్మాణాలపై చర్యలు
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

వడాలి రోడ్డు సైడ్ డ్రెయిన్‌పై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముదినేపల్లి ఇఒపిఆర్‌డి టివి.సారథి హెచ్చరించారు. డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ముదినేపల్లి ఇఒపిఆర్‌డి టివి.సారథి అక్రమ నిర్మాణాలు జరిగే ప్రాంతాన్ని పెయ్యేరు పంచాయతీ కార్యదర్శి వై.శ్యామ్‌సుందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సారథి మాట్లాడుతూ డ్రెయిన్లపై ఎవ్వరూ ఎలాంటి నిర్మాణాలు చేయరాదన్నారు. డ్రెయిన్‌పై నిర్మాణాలు చేస్తున్న వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు.

నేడు ఏలూరుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పోణంగి రోడ్డులో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించడానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈ నెల 21వ తేదీ శనివారం ఏలూరు వస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ తెలిపారు. సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సమావేశం పి.పెంటయ్య అధ్యక్షతన ఆర్ఆర్.పేట స్ఫూర్తి భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో లబ్ధిదారులు, సిపిఐ నాయకులు, సభ్యులు పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు బళ్ల కనకదుర్గారావు, మావూరి విజయ, కురేళ్ల వరప్రసాద్, తెర్లాపు శ్రీను పాల్గొన్నారు.

వరి పైరు పరిశీలన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల్లో వరి పైరును మండల వ్యవసాయ అధికారి పోసారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాళ్వా సాగులో వరి పొలాలకు కాండం తొలచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. రైతులందరూ సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగిడిగూడెం సర్పంచి కోట వెంకటేశ్వరరావు, పేరంపేట, పంగిడిగూడెం గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

క్లీన్ నూజివీడుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలో నిర్వహించాల్సిన రీ సర్వే, క్లీన్‌ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్)పై మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రషీద్ అహ్మద్ మాట్లాడుతూ రీ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. క్లీన్ నూజివీడు టౌన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా ముందడుగులు వేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ సచివాలయ సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేయాలని ఆదేశించారు. సిడిఎంఎ పీడీ ప్రవీణ్‌కుమార్‌తో ఈ మేరకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

వికలాంగునికి ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి పదిమందికి సాయం చేయాలని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు రాధారాణి అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో మానవ సేవే-మాధవ సేవ ట్రస్ట్ ద్వారా బొప్పన రాధమ్మ ఆర్థిక సాయంతో ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, ఎస్‌సి సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను ఆధ్వర్యంలో వికలాంగుడైన రోహిత్‌కి మూడు చక్రాల ట్రైసైకిల్‌ని అందించారు.